# సింగిల్ పేజీ కథలు

## పుణ్యాత్ములు

రమణమూర్తికి వాళ్లమ్మను తీసుకొని పుష్కర స్నానానికెళ్లి పితృ దేవతలకు పిండప్రదానం చేయాలనుంది. భార్య శైలజ కూడా "ఇరుగు పొరుగు అందరూ వెళ్లొస్తున్నారు. నేనెలాగూ రాలేను. అత్తయ్యగార్ని తీసుకుని మీరు వెళ్లిరండి" అని పోరుపెడుతోంది.

"అప్పుడెప్పుడో గోపాలం కూడా పుష్కరాలొస్తున్నాయి వెళ్లి రావాలన్నాడు. విజయవాడ అయితే రద్దీ ఎక్కువ. చుట్టుపక్కలెక్కడికయినా వాళ్లు వస్తానంటే అమ్మను తీసుకొని వాళ్లతో పాటు వెళ్లి వస్తే బాగుండును" అనుకున్నాడు రమణమూర్తి.

ఆఫీసులో అతని కొలీగ్ గోపాల్. ఇద్దరూ స్నేహంగా ఉంటారు. ఈ విషయం ఆఫీసులో అడగటం ఎందుకులే అని గోపాలం ఇంటికి వెళ్లాడు రమణమూర్తి. అతణ్ణి చూసి "రండి, అన్నయ్యగారూ! బాగున్నారా?" అన్నది గోపాలం భార్య సరళ.

"ఏమ్మా! వీడింకా లేవలేదా" అన్నాడు రమణమూర్తి.

ఇంతలో గోపాలం రానే వచ్చాడు. వాళ్లు మాట్లాడుకుంటూ ఉండగా సరళ ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది.

కొంచెం సేపయ్యాక "ఒరే గోపాలం! మీరు పుష్కరాలకెళ్తారన్నారు కదా? ఎప్పుడెళ్తున్నారు. మీరు వెళ్లేటప్పుడు నేను, అమ్మ కూడా వస్తాంరా! ఈ జనం రద్దీలో బస్సులెక్కీ దిగి అమ్మకి అవస్థవుతుందేమో!

నా సంగతి నీకు తెలిసిందేగా! కారు పెట్టి తీసుకెళ్లే పరిస్థితి లేదు. మీరు కూడా వస్తానంటే కలిపి షేర్ చేసుకుందాం" అన్నాడు రమణమూర్తి చనువుగా.

అక్కడే ఉన్న సరోజ ఏదో అనబోతుండగా గోపాలం అడ్డు తగిలి, "అదేరా, ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదు. మా అన్నయ్యవాళ్లు కూడా వస్తే ఈ ఊరు వచ్చి కలిపి వెళ్దాం అన్నారు. ఏదీ తేలకుండా ఏం చెప్పను? నా కోసం నువ్వు కూడా ఆగటం ఎందుకు?" అన్నాడు గోపాలం.

ఉసూరుమంటూ ఇంటికెళ్లాడు రమణమూర్తి.

"అదేమిటండీ, అలా చెప్పారు? బావగారు వాళ్లు ఎప్పుడొస్తామన్నారు?" అడిగింది సరళ.

"లేకపోతే ఇంతా ఖర్చు పెట్టుకుని కారు మాట్లాడుకుని హాయిగా వెళ్లకుండా మళ్లీ ఇరుక్కుంటూ వాళ్లు కూడా ఎందుకు? వాడి దగ్గర డబ్బులు తీసుకున్నా బాగుండదు. మనం, మన పిల్లలు దర్జాగా వెళ్లిరాక" అన్నాడు గోపాలం.

తరువాత నాలుగు రోజులకి రమణమూర్తి పొద్దున్నే తల్లిని తీసుకుని బస్సులో నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న పుష్కర ఘాట్‌కు బయలుదేరాడు. బస్టాండులో దిగి అక్కడ నుండి రిక్షాలో ఘాట్‌కు దూరంగా దిగి, అక్కడి నుండి నడుచుకుంటూ వెళ్లారు. స్నానాదికాలు పిండప్రదాన, దానధర్మాలు చేశాడు. ప్రొద్దెక్కుతున్న కొద్దీ పెరుగుతున్న జనం లోంచి ఈ కార్యక్రమాలన్నీ పూర్తిచేసి బయటపడి మళ్లీ నడిచివచ్చేసరికి రమణమూర్తి తల్లికి ఆయాసం వచ్చింది. అసలే ఆవిడకు బి.పి., షుగరు. మనిషి జావగారిపోసాగింది. ఎలాగో బస్టాండుకు చేర్చాడు. బస్‌లు వస్తున్నాయ్, పోతున్నాయ్! కానీ, జనాన్ని తోసుకుని ఆమె బస్ ఎక్కలేకపోయింది. ఎండ నడి నెత్తి మీదకు వచ్చింది. ఇక లాభం లేదనుకుని ఆమెను రోడ్డు మీదకు తీసుకొచ్చి స్థిమితంగా కూర్చోబెట్టి బిస్కట్లు, మంచినీళ్లు ఇచ్చాడు.

కాసేపు అటు ఇటూ తిరిగి ఒక ఆటోని తీసుకొచ్చాడు. వాళ్లమ్మ కూర్చున్నాక రమణమూర్తి కూర్చోబోతుంటే "అమ్మగార్ని పడుకోమనండి సార్! మీరు ఇలా ముందొచ్చి కూర్చోండి" అన్నాడు ఆటోడ్రైవర్.

"ఇలాంటి వాళ్లు ఉండబట్టే నాలాంటి బడుగుజీవుల బ్రతుకు నడుస్తోంది. లేకపోతే నిండా ఎడాపెడా తొక్కి తీసుకెళ్లవలసిన ఇతను అమ్మను చూసి ఎవరినీ ఎక్కించుకోకుండా వస్తాడా?" అనుకుంటూ ముందు కూర్చున్నాడు రమణమూర్తి.

ఆటో ముందుకి పోతుంటే చల్లగాలి తగిలి కళ్లు మూసుకుని పడుకున్న రమణమూర్తి తల్లికి కాస్త సేద దీరి, ఆయాసం తగ్గటం చూసి రమణమూర్తి ఊపిరి పీల్చుకున్నాడు.

డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి అతనితో మాటల్లో పడ్డాడు.

డ్రైవర్ మాట్లాడుతూ "నేను మొదటిరోజున స్నానం చేసి ఆ దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను సార్! నాకు దానధర్మాలు చేసే శక్తి లేదు. నాకు చేతనయినంతలో, వీలున్నంతవరకు పిల్లాజెల్లాతో, ముసలివాళ్లతో బాధపడేవాళ్లను నా ఆటోలో తీసుకెళ్తున్నాను. వాళ్లను పీడించి ఇంతయితే గానీ రాను అనకుండా న్యాయంగా ఎంత ఇస్తే అంత తీసుకుంటున్నాను. భగవంతుడు దయతలచి ఇస్తే ఈ పుణ్యం చాలులే అనుకున్నాను" అన్నాడు.

రమణమూర్తికి చాలా సంతోషమనిపించింది.

"మానవసేవే మాధవసేవ అనుకున్నావయ్యా! నీ చలవ వల్ల నేను మా అమ్మను జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్లగలుగుతున్నాను. అక్కడే ఎదురుచూస్తూ కూర్చుంటే ఎలా ఉండేవాళ్లమో! భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు" అన్నాడు రమణమూర్తి.

ఆటో సగం దూరం వచ్చేసరికి రోడ్డుకి ఒకపక్కన ఆపి ఉన్న కారు దగ్గర నిలబడి కనిపించాడు గోపాలం భార్యా పిల్లలతో.

"వీడిక్కడున్నాడేమిటి?" అనుకుని ఆటో ఆపించి దిగి గోపాలం దగ్గరకెళ్లాడు రమణమూర్తి.

"ఏరా, మీరు కూడా పుష్కరాలకేనా వచ్చింది? ఇక్కడ ఆగారేమిటి?" అడిగాడు.

అతన్ని చూసి గోపాలం ఖంగుతిన్నాడు.

నెత్తిమాడిపోతూ, తెచ్చుకున్న నీళ్లన్నీ అయిపోయి గొంతెండిపోతుంటే, తడిబట్టల సంచులు పెట్టుకుని ఎదురుతెన్నులు చూసుకుంటూ కూర్చున్న గోపాలానికి రమణమూర్తి ఎదుటపడేసరికి ముఖంలో నెత్తురుచుక్కలేనట్లు పాలిపోయింది. స్నేహితుడు నోరు తెరిచి అడిగితే స్వార్థానికి పోయినందుకు తగిన శాస్తి తనకు జరిగిందనుకున్నాడు.

"అవునురా! అయిపోయి తిరిగి వస్తుంటే టాక్సీ చెడిపోయింది. షెడ్‌కి వెళ్లాల్సిందే. లాభం లేదన్నాడు డ్రైవర్. ఒక్క బస్సుగాని, కారు గానీ ఏవీ ఖాళీగా లేవు. అందుకే ఇక్కడ వేళ్లాడుతున్నాం" అన్నాడు గోపాలం.

"మీ అన్నయ్య వాళ్లు రాలేదా? మీరే కనపడుతున్నారు?" అన్నాడు రమణమూర్తి అటు ఇటు చూస్తూ.

"లేదురా, మేమే వచ్చాం!" అన్నాడు గోపాలం బిక్కచచ్చిపోతూ.

"అయితే ఇంకేం! మనమే అయితే ఇందులోనే వెళ్లిపోదాం పద" అన్నాడు రమణమూర్తి.

రమణమూర్తి తల్లి లేచి కూర్చుంది. పిల్లల్ని ఒళ్లో పెట్టుకుని అందరూ కూర్చున్నారు.

"భగవంతుడిలా వచ్చి ఆదుకున్నాడు రమణ. గొప్పగా తానే కారులో వెళ్లి ఏదో ఘనకార్యం చేస్తున్నట్లు భావించాడు. మనసు నిండా మురికి ఉన్న నేను ఎన్ని పుష్కర స్నానాలు చేస్తే మాత్రం ఆ పాపం ప్రక్షాళనవుతుంది? నేను సహకరించకపోయినా వాడు నాకు చేసిన ఉపకారానికి వాడికి చేతులెత్తి నమస్కరించాలి. వాడే పుణ్యాత్ముడు" అనుకున్నాడు గోపాలం ఖిన్నమైన మనసుతో.

**-యం.పర్వతవర్ధని (విశాఖపట్నం)**